చిత్రకళ .. భావితరాలకు అందేలా

వందేండ్లకు ముందే కొండపల్లి మదిన మొలిచిన ఆలోచన

- ప్రాచీన చిత్రకళా వైభవం.. వీక్షకులకు కనువిందు కళా ప్రపంచం
- రేపటితో ముగియనున్న చిత్రకళా ప్రదర్శన

తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 3: చిత్రకళా చరిత్రను, చిత్ర కళా వారసత్వాన్ని భావితరాలకు అందించాలనే సంకల్పం వందేళ్ళ కాలం నాడే తెలంగాణ ప్రాంతానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు డాక్టర్ కొండపల్లి శేషగిరిరావు మదిలో మొలిచింది. ప్రాచ్య శైలి, ప్రాంతీయ ప్రజా జీవితము శేషగిరిరావు కుంచె నుంచి కలగలిపి ప్రవహించిన ఆయిల్ పెయింటింగ్స్, మ్యురల్స్, ఆక్వాటెక్చర్ పెయింటింగ్ తదితర అందమైన చిత్రాల సమాహారంగా మాదాపూర్‌లో గల చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కొలువు దీరింది. శేషగిరిరావు చిత్రకళా వైదుష్యానికి నిదర్శనంగా ఈ కళా ప్రదర్శన నిలిచింది. ఆయన చేతిలో రూపుదిద్దుకున్న కళా, సౌందర్య చిత్రాలు వీక్షకులకు, వర్థమాన సృజనాత్మక కళాకారులకు చిత్రకళ పట్ల అభిరుచిని పెంచుతాయనడంలో అతిశయోక్తి లేదు. ప్రాంతీయతకు, జాతీయతకు పెద్ద పీట వేస్తూ సాగించిన ఆయన కళాఖండాలు ఆయన ఆలోచనా శైలికి, దార్శనికతకు అద్దం పడుతుంది. 1940 కాలం నుంచి ఇటీవల 2012 వరకు ఆయన జీవిత కాలంలో గీసిన వైవిధ్యభరితమైన 250 చిత్రకళా ఖండాల ప్రదర్శన కళాప్రియులకు ఒక సందేశాన్ని అందిస్తోంది. ఫిబ్రవరి 5వరకు కొనసాగనున్న ఈ చిత్రకళా ప్రదర్శన భావితరాల కళాకారులకు ఒక నిఘంటువుగా నిలవనుంది.

రావు చిత్రాలలో భారతీయ కళా తత్వాలు..

భారతీయ కళా తత్వాలను వివరించేలా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని చారిత్రక స్థలాల శిల్పకళా వైభవాన్ని శేష గిరిరావు నేటి తరానికి పరిచయం చేసిన ఆధునిక రుషి. హంపీ, లేపాక్షి, కాకతీయ శిల్పకళా వైభవంతో పాటు నకాషీ పట చిత్రకళను ప్రపంచానికి పరిచయం చేసి చారిత్రక, సాంస్కృతిక పరిరక్షకుడిగా నిలిచారు. ప్రాచీన చిత్రకళా వారసత్వాన్ని శేషగిరి రావు శతాబ్ధి వేడుకల సందర్భంగా మరోసారి నేటి తరం వీక్షించి స్ఫూర్తి పొందేందుకు ఇదొక అద్భుత అవకాశం. ఫిబ్రవరి 5తో ఈ ప్రదర్శన ముగియనుంది.

రివైవింగ్ ది రూట్స్ ప్రత్యేకత..

ఇతిహాసాలు, చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, ప్రజల జీవన విధానాలను మనస్సులోని భావాలను జోడించి అందమైన చిత్రాలుగా రూపొందించిన కొండపల్లి శేషగిరిరావు కళా ప్రతిభను చూడడానికి రెండు కళ్ళు చాలవు అన్నట్లుగా చూపరుల మదిలో చిరస్థాయిగా నిలుస్తుందనడంలో అతిశయోక్తి లేదు. జన్మతః బొమ్మలు వేయడంలో వచ్చిన అభిరుచితో రామప్ప, వేయి స్థంభాల ఆలయాల శిల్పాలు తదితర అసంఖ్యాక చిత్రాలు కొలువై ఉన్నాయి. ఆయనలోని సృజనాత్మక చిత్రకళా సౌందర్యాన్ని వీక్షించడానికి ప్రతి ఒక్కరు సమయం కేటాయించి ఆర్ట్ గ్యాలరీని సందర్శించవలసిన అవసరం ఎంతైనా ఉంది. 'కలువల కొలనులో కలువ కనుల సుందరి, పల్లెల రమణీయత, ప్రకృతి' దృశ్యాలు ఆయన తన చిత్రాల ద్వారా మన కళ్ళకు కట్టారు. ప్రధానంగా తెలంగాణ ప్రాంతంలోని ప్రజల జీవన శైలి, వైవిధ్య జీవితం సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచుతాయనడంలో అతిశయోక్తి లేదు. ఆయన గీసిన చిత్రాలలోని భంగిమలు, హావభావాలు కాకతీయ శిల్పాల గురించి లోతైన అవగాహనతో రూపొందించినవిగా చెప్పవచ్చు. శిల్పానుగుణమైన చిత్రాల్లో ప్రాచ్య, తాత్వికతా, ఆధ్యాత్మికత కలగలిపి చూపరులకు ఏవో అతీత భావనలు కలిగించారు శేషగిరిరావు.

ఫిర్యాదుల స్వీకరణ సరే.. పరిష్కారమేదీ?

జీహెచ్ఎంసీలో మొక్కుబడిగా ప్రజావాణి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 3(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ ప్రజావాణిపై అర్జీదారుల్లో నమ్మకం సన్నగిల్లింది. సుదూర ప్రాంతాల నుంచి ఎంతో ఆశగా ఆపరిష్కృత సమస్యను మేయర్, కమిషనర్‌కు విన్నవిస్తే పరిష్కారం దొరుకుతుందని భావించిన సదరు అర్జీదారుడికి నిరాశే ఎదురవుతున్నది. కమిషనర్ మొదలు ఉన్నతాధికారులు, అర్జీదారుల ఫిర్యాదును స్వీకరించి పరిష్కరిస్తామని చెబుతున్నారే తప్ప, ఇచ్చిన ఫిర్యాదుకు ఎన్ని రోజుల్లో పరిష్కారం చూపుతున్నారు? కనీసం ఫిర్యాదుదారుడితో సమన్వయం చేసుకోవడంలో విఫలం చెందుతున్నారు. వ్యక్తిగత, సామాజిక సమస్యలపై ఎన్ని రోజుల్లో పరిష్కారం చేస్తారో అర్జీదారునికి లిఖిత పూర్వకంగా సమాధానం పంపించాలని అధికారులను కమిషనర్ ఆదేశించిన ఫలితంగా ఉండటం లేదని అర్జీదారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రజావాణిలో అత్యధికంగా టౌన్ ప్లానింగ్ సంబంధించినవే ఉంటున్నాయి. గడిచిన నాలుగు నెలల్లో ఒక్క టౌన్ ప్లానింగ్ ఫిర్యాదులను పరిశీలిస్తే ఆరు జోన్లలో మొత్తం 174 ఫిర్యాదులను పరిష్కరించాల్సి ఉంటుంది. వీటితో పాటు వివిధ కారణాలతో 156 పెండింగ్ దశలోనే చూపుతున్నారు. ఏడు చోట్ల మాత్రమే కూల్చివేతలు జరిపినట్లు అధికారుల నివేదికలో వెల్లడించారు. ఈ క్రమంలోనే ప్రజావాణిలో ఒక సారి కాకుంటే మరోసారి వచ్చి ఫిర్యాదు చేసిన లాభం ఉండటం లేదని అర్జీదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధిగా వ్యవహరించాల్సిన ప్రజావాణీని తూతూ మంత్రంగా నిర్వహిస్తుండటం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జాప్యాన్ని సహించేది లేదు: కమిషనర్

ప్రజల నుంచి వచ్చిన విన్నపాల పరిష్కారంలో జాప్యాన్ని సహించేది లేదని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. సమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలన్నారు.

యువతకు ఆపద మిత్ర వాలంటీర్ శిక్షణ

శిక్షణలో పాల్గొన్న అధికారులు, యువత

సిటీ బ్యూరో, ఫిబ్రవరి 3(నమస్తే తెలంగాణ): విపత్కర వైపరీత్యాలు సంభవించినప్పుడు యువత సహాయక చర్యల్లో స్వచ్ఛందంగా పాల్గొనాలని హైదరాబాద్ జిల్లా యువజన, క్రీడా అధికారి ఎన్.సుధాకర్ రావు అన్నారు. ఆపద మిత్ర శిక్షణ తరగతులను సికింద్రాబాద్ బోట్స్ క్లబ్‌లోని యువజన సర్వీసుల కార్యాలయంలో సోమవారం ఆయన ప్రారంభించారు. శిక్షణ తరగతుల్లో వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. శిక్షణ తరగతులు 12 రోజులు కొనసాగాతాయని తెలిపారు. జిల్లాలోని ఆసక్తి కలిగిన యువత తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి, హైడ్రా స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్యాసుందర్ రెడ్డి అవగాహన తరగతులు నిర్వహించారు.

మల్లేపల్లి ఐటీఐలో 6న జాబ్ మేళా

సిటీ బ్యూరో, ఫిబ్రవరి 3(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పనాధికారిణి ఏ.వందన తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 6న ఉదయం 10 గంటల నుంచి జాబ్ మేళా ప్రారంభమవుతుందని ఆమె పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పాసైన నిరుద్యోగులకు టెక్ మహీంద్ర కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. జిల్లాలోని నిరుద్యోగులు బయోడేటా, విద్యార్హతల ధ్రువ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం. 83284 28933లో సంప్రదించవచ్చని తెలిపారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 3(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ఎస్సీ విద్యార్థులు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కోటాజీ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపకార వేతనాల కోసం గతేడాది 23,941 మంది దరఖాస్తు చేసుకుంటే, ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 17,854 అప్లికేషన్లే వచ్చాయని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి మార్చి 31వ తేదీ వరకు గడువు ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాలల విద్యార్థులు, యాజమాన్యం అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

హైడ్రా ప్రజావాణికి 71 ఫిర్యాదులు

సిటీ బ్యూరో, ఫిబ్రవరి 3(నమస్తే తెలంగాణ): హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణికి 71 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదులపై సోమవారం అప్పటికప్పుడే అధికారులతో చర్చించిన రంగనాథ్ ఆక్రమణదారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదుల్లో అధిక భాగం పార్కులు, రహదారుల కబ్జాలే ఉన్నాయని, లే ఔట్ ప్రకారం, రోడ్లుండేలా చూడాలని సూచించారు. ఆక్రమణలను గూగుల్ మ్యాప్ ద్వారా పరిశీలించి పరిష్కారం చూపుతామని ఫిర్యాదుదారులకు హామీ ఇచ్చారు. గేటెడ్ కమ్యూనిటీల మాదిరిగా కాలనీల చుట్టూ రహదారులు నిర్మిస్తే వెంటనే తొలగించాలని హైడ్రా అధికారులను ఆదేశించారు. గతంలో సెప్టిక్ ట్యాంకుల కోసం కేటాయించిన స్థలాలు వినియోగంలో లేవని, వాటిని ప్రజావసరాలకు కేటాయించిన స్థలాలుగానే పరిగణించాలన్నారు. ఎవరైనా కబ్జా చేస్తే వెంటనే ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించారు.

లీజు ముగిసినా.. పాత కాంట్రాక్టర్‌తోనే పనులు!

అంబర్‌పేట మున్సిపల్ కబేలా నిర్వహణకు కొత్త టెండర్లను పిలవండి

ఖజానాకు నష్టం కలిగిస్తున్న కాంట్రాక్ట్‌ను తక్షణమే నిలిపివేయండి

కమిషనర్ ఇలంబర్తిని కలిసి వినతిపత్రం సమర్పించిన సీపీఎం నేత శ్రీనివాస్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 3(నమస్తే తెలంగాణ): అంబర్‌పేట మున్సిపల్ కబేలా నిర్వహణ ఒప్పందం గత ఏప్రిల్‌లో ముగిసినప్పటికీ, ఇప్పటి వరకు కొత్త టెండర్లు పిలవకుండా పాత రేట్ల ప్రకారమే కాంట్రాక్టర్‌ను కొనసాగిస్తున్నారని, ఇలా పాత రేట్ల ప్రకారమే కొనసాగించడంతో జీహెచ్ఎంసీకి రావాల్సిన ఆదాయం కోల్పోతున్నదని సీపీఐ(ఎం) గ్రేటర్ సెక్రటేరియట్ సభ్యులు ఎం.శ్రీనివాస్ ఆరోపించారు. లీజు మొత్తాన్ని కాంట్రాక్టర్ ఏటా 10 శాతం పెంచుతూ 2021-22లో 1.21 కోట్లు చెల్లించగా, 2022-23లో 1.33 కోట్లు, 2023-24లో 1.46 కోట్లు చెల్లించగా, ఈ ఏడాది ఏ మాత్రం పెంచకుండా గతేడాది చెల్లించిన మొత్తాన్నే చెల్లిస్తున్నారని పేర్కొంటూ సోమవారం కమిషనర్ ఇలంబర్తిని కలిసి శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడి కారణంగానే టెండర్లు పిలవకుండా పాత కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూరేలా కొనసాగున్నారని కమిషనర్ సమర్పించిన వినతిలో పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ ఆదాయానికి నష్టం కలిగిస్తున్న ఈ కాంట్రాక్ట్‌ను తక్షణమే నిలిపివేసి కొత్త టెండర్లు వెంటనే వేయాలని శ్రీనివాస్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

స్విమ్మింగ్‌లో ఎంఎల్ఆర్ఐటీ చైర్మన్ మర్రి ఘనత

దుండిగల్, ఫిబ్రవరి 3: ఎంఎల్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి మరో ఘనత సాధించారు. 80 ఏండ్ల వయస్సులో కృష్ణానదిలో ఈది యువతకు ఆదర్శంగా నిలిచారు. విజయవాడ సమీపంలోని కృష్ణానదిలో 1.5 కిలోమీటర్ల దూరాన్ని 40 నిమిషాల 07 సెకండ్ల వ్యవధిలో ఈది రికార్డు సృష్టించారు. ఆయన ఇలాంటి స్విమ్మింగ్ చేయడం ఇది రెండోసారి. విజయవాడకి చెందిన అక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'కృష్ణా రివర్ క్రాసింగ్ స్విమ్మింగ్ కాంపిటీషన్'లో మర్రి లక్ష్మణ్ రెడ్డి ఈ ఘనత సాధించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఆర్ఐటీ ఫౌండర్ సెక్రటరీ, మాల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా. కే.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ, 80 ఏండ్ల వయస్సులో చలిని తట్టుకొని స్విమ్మింగ్ చేయడం గొప్ప విషయమని, మర్రి లక్ష్మణ్ రెడ్డి నేటి యువతకు ఆదర్శమన్నారు.ఆయనను ఆదర్శంగా తీసుకుని తమ కళాశాలలో చదువుతూ క్రీడల్లో పాల్గొనే విద్యార్థులకు ప్రతి ఏటా రూ. 1.5 కోట్ల ఉపకార వేతనాలను క్రీడా కోటాలో అందిస్తూ సుమారు 36 మందికి ఉచిత విద్యను అందిస్తున్నామని తెలిపారు.

సీపీఆర్ విధానంపై ప్రజలకు అవగాహన అవశ్యం

జయప్రకాష్ నారాయణ

కోడ్ బ్లూ పేరుతో చేపట్టనున్న సీపీఆర్ అవగాహన కార్యక్రమం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ

మన్సూరాబాద్, ఫిబ్రవరి 3: గుండెపోటు వచ్చిన సమయంలో అత్యవసరంగా మొదట చేయవల్సిన ప్రాథమిక చికిత్స సీపీఆర్‌పై ప్రజ లు అవగాహన కలిగి ఉండాలని లోక్‌సత్తా వ్య వస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ తెలిపారు. గుండెపోటు సమయంలో అత్యవసరంగా చేపట్టే సీపీఆర్ ప్రథమ చికిత్సపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సా మాజిక కార్యకర్త దోసపాటి రాము ఆధ్వర్యం లో కోడ్ బ్లూ పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ సో మవారం ఆవిష్కరించారు. జయప్రకాష్ నా రాయణ మాట్లాడుతూ, సీపీఆర్ చేయడం ద్వారా మనిషి జీవితాన్ని కాపాడవచ్చనే సం ఘటనలు ఈ మధ్య కాలంలో అనేకం జరిగాయన్నారు. దీనికి సంబంధించి సామాజిక కా ర్యకర్తలు దోసపాటి రాము, యశస్వినీ జొన్నల గడ్డ కోడ్ బ్లూ పేరుతో చేపడుతున్న కార్యక్రమం అభినందనీయమన్నారు. కార్పొరేట్, ప్రైవేటు దవాఖానల యాజమాన్యాలు ఇలాంటి కార్యక్రమాలను చేపట్టి యువతకు సరైన శిక్షణను ఇస్తే ఇంటికి ఒక సీపీఆర్ వాలంటీర్‌ను తయారు చేయవచ్చునని తెలిపారు.

మాకు ఇండ్లు కావాలె

హైదరాబాద్ కలెక్టరేట్‌లో దరఖాస్తుల వెల్లువ.. ప్రజావాణికి తరలిన వందలాది మంది

సిటీబ్యూరో, ఫిబ్రవరి 2(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి దరఖాస్తుదారులు పోటెత్తారు. ఒకవైపు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్జులను గుర్తించేందుకు అధికారులు వార్డుల్లోకి వెళ్తుంటే.., అర్హులేమో దరఖాస్తులు చేసుకోవడానికి కలెక్టరేట్‌కు క్యూ కడుతున్నారు. దీంతో అధికారులు ఇళ్ల వద్దకు వెళ్లి ఆరా తీయగా, దరఖాస్తు చేసుకోవడానికి కలెక్టరేట్‌కు వచ్చామని చెబుతున్నారు. దీంతో ప్రజా పాలన లబ్ధిదారులను గుర్తించడంలో గందరగోళం నెలకొంది. ప్రజా పాలనలో భాగంగా ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు ఫారాలతో వందలాది మంది ప్రజలు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. నగరం నలుమూలల నుంచి దరఖాస్తుదారులు రావడంతో కలెక్టరేట్ ప్రాంగణం కిటకిటలాడింది. దరఖాస్తులు స్వీకరించేందుకు అధికారులు నాలుగు కౌంటర్లను ఏర్పాటు చేశారు. వార్డు సభల్లో అధికారులు విడుదల చేసిన లిస్టులో తమ పేర్లు రాలేదని కొందరు, అధికారులు తమ వద్దకు సర్వే చేయడానికి రావడం లేదని మరికొందరు కలెక్టరేట్‌కు వచ్చి దరఖాస్తులను సమర్పించారు. తమ ఇరుగు పొరుగు వారి వద్దకు వచ్చిన అధికారులు.. తమ వద్దకు రాలేదని దరఖాస్తుదారులు చెబుతున్నారు.

అధికారులు ఇళ్ల వద్దకు... అర్హులు కలెక్టరేట్‌కు..!

అర్హులను గుర్తించేందుకు జీహెచ్ఎంసీ, పౌర సరఫరాల శాఖ అధికారులు వార్డుల్లోకి వెళ్తున్నారు. అటు లబ్ధిదారులేమో దరఖాస్తు ఫారాలు తీసుకుని కలెక్టరేట్‌కు వస్తున్నారు. దీంతో అధికారులు వెళ్లినప్పుడు అర్హులు ఇళ్ల వద్ద ఉండకపోవడంతో గందరగోళం నెలకొంటుంది. సర్వే కోసం అధికారులు వస్తున్నట్లు సమాచారం లేకపోవడం వల్ల కూడా అర్హులు ఇళ్లలో ఉండటం లేదని తెలుస్తున్నది. దీంతో అసలైన అర్హులు సర్వేలో పాల్గొనడం లేదని, తమకు అర్హత ఉన్నా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకు ఎంపిక చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని వార్డుల్లో దరఖాస్తులు తీసుకోవడం లేదని చెబుతున్నారు. అధికారులు ఏ ప్రాంతంలో సర్వే చేస్తున్నారో ముందస్తుగా సమాచారం ఇచ్చి రావాలని కోరుతున్నారు.

ప్రభుత్వంపై నమ్మకం కుదరకనే...

గతంలో ప్రజా పాలన దరఖాస్తులు వార్డుల్లో సమర్పించినా వార్డు సభల్లో విడుదల చేసిన లిస్టులో తమ పేర్లు లేకపోవడంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. మరోసారి వార్డు సభల్లో దరఖాస్తు చేసుకున్నా ఫలితం ఉండదని భావించి కలెక్టరేట్‌కు వచ్చి అందజేస్తున్నామని చెబుతున్నారు. అర్హత ఉన్నప్పటికీ వార్డు సభల్లో తమ పేరు రాలేదని వాపోతున్నారు. నేరుగా కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే అర్హుల జాబితాలో పేరు వస్తుందని భావిస్తున్నారు. కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకే దరఖాస్తులు తీసుకుంటున్నారని చెబుతున్నారు. ఆ తర్వాత వస్తే వచ్చే సోమవారం రావాలని చెబుతున్నారని బాధితులు వాపోతున్నారు.

అధికారులు రాలేదు.. లిస్ట్‌లో పేరు లేదు

నేడు వికలాంగుడిని. 35 ఏండ్లుగా గోల్కొండలో అద్దె ఇంట్లో ఉంటున్నా. ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నా. వార్డు సభలో విడుదల చేసిన జాబితాలో నా పేరు రాలేదు. అర్హులను గుర్తించడానికి మా ఇరుగు పొరుగు వారింటికి వస్తున్నారు. కానీ, మా ఇంటికి రావడం లేదు. మూడు నెలలుగా కలెక్టరేట్‌కు వచ్చి దరఖాస్తులు సమర్పిస్తున్నా. నాకు ఇల్లు వస్తుందనే భరోసా మాత్రం ఇవ్వడం లేదు. దయచేసి ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితాలో నాపేరు చేర్చాలని అధికారులను వేడుకుంటున్నా.

– మహ్మద్ హబీబ్, గోల్కొండ;

వార్డుల్లో దరఖాస్తులు తీసుకోట్లేరు

రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే వార్డు సభలో తీసుకోలేదు. ఎమ్మా ర్వో, జీహెచ్ఎంసీ కార్యాలయాలకు వెళ్లి అడిగినా పట్టించుకోవడం లేదు. మా ప్రాంతంలో అధికారులు సర్వే చేయడానికి రావడం లేదు. నేరుగా కలెక్టరేట్‌లో దరఖాస్తు చేసుకుందామని వచ్చాను. ఇక్కడైనా దరఖాస్తు తీసుకుంటారని భావిస్తే.. సమయం ముగిసింది. వచ్చే సోమవారం రావాలని చెప్పారు.

– సంతోష్, ఈస్ట్ మారేడ్‌పల్లి;

ప్రజావాణికి 1975 దరఖాస్తులు

హైదరాబాద్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 1975 దరఖాస్తులు వచ్చాయని అదనపు కలెక్టర్లు కదివరన్ పలాని, ముకుంద రెడ్డి తెలిపారు. ప్రజలు అందజేసిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు 1279, రేషన్ కార్డుల కోసం 563, పింఛన్లకు 33, డీఈవో 7, రెవెన్యూ 7, పౌర సరఫరాలు 7, మైనారిటీ 4, వికలాంగుల శాఖ 4, సీపీఓ 1, జీహెచ్ఎంసీ 2, ఇతర శాఖలకు సంబంధించినవి 68 దరఖాస్తులు అందాయని వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్వో ఈ.వెంకటాచారి, ఆర్డీవో సాయిరాం, జిల్లా అధికారులు ఆర్.రోహిణి, జి.ఆశన్న, పవన్ కుమార్, కోటాజీ, డీఎంహెచ్‌వో వెంకటి, సుబ్రహ్మణ్యం, ఇలియాజ్ అహ్మద్, రాజేందర్, శ్రీరామ్, రమేశ్ పాల్గొన్నారు.

అనంత్ డైమండ్స్ షోరూమ్ ప్రారంభం

జూబ్లీహిల్స్ రోడ్ నం.46లో అనంత్ డైమండ్స్ ఫ్లాగ్‌షిప్ షోరూమ్‌ను ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ కమిషనర్ రేఖా రాణితో పాటు మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్ సోమవా రం ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు భానుప్రకాష్, విష్ణుప్రియ పాల్గొన్నారు.

– బంజారాహిల్స్

వర్గీకరణపై చర్చించకుండా చేస్తే.. రాష్ట్రం అగ్నిగుండమే

మాల సంఘాల జేఏసీ చైర్మన్ జె.చెన్నయ్య.. సీఎం రేవంత్ రెడ్డికి అల్టిమేటం

అభివాదం చేస్తున్న మాల సంఘాల జేఏసీ చైర్మన్ జె.చెన్నయ

రవీంద్రభారతి, ఫిబ్రవరి 3: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ క్రిమిలేయర్ సుప్రీం కోర్ట్ జడ్జిమెంట్ ఇచ్చినా భారత పార్లమెంట్‌లో చర్చ జరగకుండా రాష్ట్రాలలో వర్గీకరణ చేయకూడదని మాల సంఘాల జేఏసీ చైర్మన్ జె.చెన్నయ్య డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాల సంఘాల జేఏసీ చైర్మన్ జె.చెన్నయ్య మాట్లాడుతూ దళిత జాతులను సామాజికంగా, రాజకీయంగా అణచివేసి బానిసలుగా చేసుకోవడానికి మనువాద కేంద్ర, రాష్ట్ర పాలకులు, దోపిడీ కులాల పార్టీలు కుట్రలు చేశాయన్నారు. ప్రధానంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వాదాన్ని ధ్వంసం చేయడానికి ఎంఆర్‌పీఎస్ నేత మందకృష్ణ మాదిగతో చేతులు కలిపి మనువాద పార్టీలు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల హక్కులను కాలరాయడం కోసమే సుప్రీం కోర్టు ద్వారా నరేంద్ర మోదీ సర్కార్ తీర్పు ఇప్పించారని ఆరోపణలు చేశారు. ఈ నెల 7వ తేదీన మంద కృష్ణ మాదిగ చేపట్టిన లక్ష డప్పులు, వేయి గొంతుకలు కార్యక్రమం సందర్భంగా మాలలకు చావు డప్పు కొడుతామని చేసుకుంటున్న ప్రచారాన్ని మాల సంఘాల జేఏసీ తీవ్రంగా ఖండిస్తున్నాం. మాలలకు చావు డప్పు కాదని, డప్పులు కొట్టాల్సింది నరేంద్ర మోదీకి, కిషన్ రెడ్డికి, వెంకయ్య నాయుడికి కొట్టాలని ఆయన చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్గీకరణ కోసం అమలు చేస్తామని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం, వర్గీకరణపై ఎందుకు వెనక్కి తగ్గారని ప్రశ్నించారు. వర్గీకరణ అనేది రాష్ట్ర ప్రభుత్వాల దగ్గర లేదని, వర్గీకరణ అంశం యావత్ దళిత కులాల భవిష్యత్తుకు గొడ్డలి పెట్టు లాంటిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్గీకరణ అమలు చేస్తామని, ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి వర్గీకరణపై చర్చిస్తామని చెప్పడం దారుణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందే మాలల ఓట్ల ద్వారా అని, సీఎం రేవంత్ రెడ్డి వర్గీకరణ చేస్తే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని, తక్షణమే వర్గీకరణ అంశాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. బేర బాలకిషన్, జంగా శ్రీనివాస్, భుజంగ రావు, మాల జేఏసీ నేతలు పాల్గొన్నారు.

సృజనాత్మకత, పర్యావరణంపై అంతరాగ్ని

విద్యార్థులకు అవగాహన కల్పించేలా 'మేరు' అవిష్కరణలు

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా పలు రకాల ప్రదర్శనలు



కార్యక్రమంలో పాల్గొన్న రామేశ్వర్ రావు, సురేందర్ రావు, మేఘన తదితరులు

సిటీ బ్యూరో, ఫిబ్రవరి 3(నమస్తే తెలంగాణ): విద్యార్థులకు సృజనాత్మకత, పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు మేరు ఇంటర్నేషనల్ స్కూల్ 'అంతరాగ్ని' అనే కార్యక్రమాన్ని నిర్వహించింది. తెల్లాపూర్ క్యాంపస్‌లో 'సస్టెయినబిలిటీ' అనే థీమ్‌తో విద్యార్థులు, ఉపాధ్యాయులు రీసైక్లింగ్ పదార్థాలతో సోమవారం కళా ఖండాలను రూపొందించి ప్రదర్శించారు. మై హోమ్ గ్రూప్, మేరు ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ జూపల్లి రామేశ్వర రావు, యశోద మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గోరుకంటి సురేందర్ రావు, మేరు స్కూల్ వ్యవస్థాపకురాలు మేఘన అంతరాగ్ని కార్యక్రమాన్ని ప్రారంభించారు. మేఘన మాట్లాడుతూ, విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణలు, పర్యావరణ బాధ్యతను పెంపొందించడానికి అంతరాగ్ని కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. నీటి సంరక్షణపై 'నీటి బొట్లు', సమష్టిగా పనిచేసేందుకు స్ఫూర్తిని నింపే 'చీమల సమూహం', మానవ పరిణామం, అభివృద్ధిని తెలిపే 'గుహల నుంచి అంతరిక్షం వరకు', పర్యావరణ సమతుల్యతను కాపాడటంపై 'తేనెటీగల కోసం గౌరవ సూచిక నివేదిక', అప్